
# రమణ భాస్కర

ఆధ్యాత్మిక పక్షపత్రిక

05-12-2004 (6)



## శ్రీ రమణ క్షేత్రం - జిన్నూరు

పశ్చిమగోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్. పిన్: 534 265

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 11-12-04 | శని | గొరగనమూడి |
| 15-12-04 | బుధ | ఆలమూరు (మండపేట మండలం, అయ్యప్ప మందిరం) |
| 18-12-04 | శని | మ॥గం॥ 3-00లకు చిక్కడపల్లి త్యాగరాజగానసభ, హైదరాబాద్ |
| 23-12-04 | గురు | చించినాడ గీతామందిరం |
| 26-12-04 | ఆది | కాపవరం గీతామందిరం |

# తలంపే - మాయ

జన్మజన్మల నుంచి మనం ఇష్టంగా పోగుచేసుకొన్న సంస్కారాలలోంచి వచ్చేవే ఈ తలంపులు. దీనినే మాయ, మలం, చిత్‌జడగ్రంథి, మనస్సు అని అనేక పేర్లు. ఇది కాల ప్రవాహంలో ఎన్నో అనుభవాలను గడించుకొని మారుతూ ఉంటుంది. దీని మనుగడ అంతా, మారని ఆత్మసన్నిధిలోనే. ఆత్మ ఒక్కటే నిజం. అదే మనం, కాని మనం, మన తలంపులతోనూ, ఊహలతోనూ కొట్టుకొనిపోతున్నంత కాలం నిజస్థితికి చేరలేము. బాహ్య జీవితంలో మన కర్తవ్య నిర్వహణ నిమిత్తం మన పనులు చేసుకొంటూ మిగిలిన కాలంలో మౌనంగా, ప్రశాంతంగా ఉండాలి, కాని మన జీవనశైలి అంతా నిరంతరం మన మనస్సుతోనే కాపురం ఉంటున్నాము. నిద్రలో అది మనలను వదలి ఉండటం వల్ల సుఖంగా ఉంటున్నాము. ఆ సుఖం జాగ్రదవస్థలో పొందాలంటే, మనస్సుకు విలువ ఇయ్యకూడదు. ఎంత ఉదాత్తమైన ఆలోచన వచ్చినా దాన్ని నెట్టివెయ్యాలి. లేదా అది పొంచి ఉండి మనపై గొరిల్లా యుద్ధం చేస్తుంది. వివేకంతో, వైరాగ్యంతో మనం ఉంటే మనలోని బలహీనతలు మనకు తెలుస్తాయి అప్పుడు దాన్ని సంస్కరించాలి. ఈ అహంకారం ఏవిధంగా తిని భద్రంగా, బలంగా, మనుగడ సాగించాలో దానికి బాగా తెలుసు. ఎక్కడెక్కడ ఏఏ వేషాలు వెయ్యాలో తెలుసుకొని ప్రయత్నాలు సాగిస్తూ ఉంటుంది. దానితో మన గమ్యం తప్పిపోతాము. తలంపే "మాయ" అని తెలుసుకోవటానికి కోట్లాది జన్మలు పడుతుంది. సద్గురువు ప్రవచనం మనకు శక్తిని, ఉత్సాహాన్ని ఇస్తుంది. ఈ అహంకారమనే మత్తగజాన్ని లొంగదీసుకోవాలంటే "నేను ఎవడను?" అనే అంకుశంతో నైపుణ్యంగా ఉపయోగించుకొంటే, ఆ మత్తగజం మానులా పడి నశిస్తుంది. "మనకు తలంపులు పుట్టిన తరువాతే తెలుస్తుంది, కాని ఈశ్వరునికి ముందే తెలుసు లోపల ఉన్న తలంపులనే దుమ్ము అంతా పోవాలంటే, మన శక్తియుక్తులు అన్నీ గురువుపై కేంద్రీకరించాలి" అన్నారు శ్రీనాన్నగారు. మనం మన తెలివితోనూ, ధనంతోనూ, పరిసరాలతోనూ తాదాప్యం పొందటం వల్ల వచ్చే లాభనష్టాలు ఎప్పటికప్పుడు గుర్తించి, వాటిని కాల్చి బూడిద చెయ్యాలి. ఆశక్తి మనకు లేకపోతే, దైవంపై మనం శరణాగతి చెందితే మాయనుంచి తొలగించి, అమృతస్థితిని పొందేలా చేస్తుంది.

**సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం



ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 10 సంచిక : 6 పుష్పం : 13-14 05-12-2004

**RAMANA BHASKARA**

*TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE*

PAGES : 16

VOL : 10 ISSUE : 6

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETHRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401 - 31188


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 05-02-04, సింహాచలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నాకు శివుడు కంటే, విష్ణువు కంటే కూడా భక్తులు అంటే ఎక్కువ ఇష్టం. అందుచేత నేను పూజగదిలో గడిపేకాలం తక్కువ, దేవాలయంలో గడిపేకాలం తక్కువ, భక్తులమధ్యలో ఎక్కువకాలం గడపటం, భక్తులతో సన్నిహితముగా మెలగటం జరుగుతోంది. మాకు దేవతలకంటేకూడా మీరే మాకు ఎక్కువ ప్రీతిపాత్రులు. మీరు గ్రంధాన్ని చదివేటప్పుడు కేవలము శబ్దానికి అర్థం తెలుసుకుంటే సరిపోదు, ఆ శబ్దం యొక్క అర్థం ఏ వస్తువునయితే ప్రతిపాదిస్తుందో ఆవస్తువును అనుభవైకవేద్యం చేసుకోవటానికి ప్రయత్నం చేయాలి. మనకు తెలిసినా, తెలియకపోయినా బ్రహ్మం సదా మన హృదయంలో ఉంది, దాని స్వరూపం శాంతి, దాని స్వరూపం జ్ఞానం, దాని స్వరూపం ఉండటం బ్రహ్మం మనకు అనుభవంలోనికి వచ్చినప్పుడు జీవితానికి, మరణానికి ఉన్న భేదం రాలిపోతుంది, అది మన జీవితగమ్యం. బ్రహ్మానుభవం పొందాలంటే సత్పురుషుల సహవాసం అవసరం, జపధ్యానములను విడిచిపెట్టకూడదు, మీ ఇంట్లో ఎవరైనా వృద్దులు ఉంటే వారికి సేవ చేస్తూ బాధ్యతలు విడిచిపెట్టకుండా జీవించాలి. భక్తిపేరు మీద మనం డ్యూటీ విడిచిపెట్టకూడదు. బాధ్యతలు విడిచిపెడితే జ్ఞానంరాదు, సోమరితనం వస్తుంది. కేవలము పెదాలతో భగవంతుడిని ప్రార్థించటం కాదు, చేతులతో కూడా ప్రార్థించాలి. మన హృదయంలో ఉన్న వస్తువు మనకు ఎరుకలోనికి రాకుండా ఏ విషయాలు అయితే అడ్డువస్తున్నాయో వాటిని జాగ్రత్తగా, నెమ్మదిగా, స్థిరబుద్ధితో ఒకోదానిని

**ఈ సంచికలో..... సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


05-02-04 సింహాచలం ........ 1
14-11-04 పాలకొల్లు ........ 8

తొలగించుకుంటూ రావాలి. రాగద్వేషాలు తగ్గించుకొంటూ రావాలి. మనలాగే అందరూ ఉండాలని అనుకోకూడదు. ఎవరి దేహప్రారబ్ధాన్ని బట్టి వారు ప్రవర్తిస్తూ ఉంటారు. మనలను అందరూ మెచ్చుకోవాలి అని అనుకోకూడదు. మన మనస్సుకు అనుకూలంగా ప్రవర్తించే వారు ఉంటారు, మన మనస్సుకు విరుద్ధంగా ప్రవర్తించేవారు ఉంటారు. అక్కడ మనం సమానబుద్ధిని కాపాడుకొంటే, మనం ఇష్టాలు అయిష్టాలు తగ్గించుకొంటే మనస్సు సహజంగానే తన గూటిలో పడిపోతుంది అంటే హృదయగుహలో పడిపోతుంది. మనలను పొగిడినా ఇతరులే, విమర్శించినా ఇతరులే. మనకంటే వేరుగా ఏదో ఉంది అనే భేదబుద్ధి నశించినప్పుడు ఇతరులు పొగిడినా మనం పొంగిపోము, ఇతరులు విమర్శించినా మనం కృంగిపోము. ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. ఇవన్నీ కల్పించుకొనేది మనస్సే, దుఃఖపడేది మనస్సే. వికారాలు అన్నీ మనస్సులోనే ఉన్నాయి. ఈ రూపాలను నామాలను పట్టుకొని వేలాడేదీ మనస్సే. అందుచేత మనోనాశనమే మన సాధన యొక్క లక్ష్యం. మన మాటలో, మన చేతలో, మన తలంపులో మనోనాశనానికి మనం కృషి చేయాలి. విషయజ్ఞానం వేరు, ఆత్మ జ్ఞానం వేరు. విషయజ్ఞానానికి తెలుసుకొనేవాడు, తెలియబడటం, తెలియబడేది ఇవన్నీ ఉంటాయి. ఆత్మజ్ఞానం తానుగానే ఉంటుంది, అది ఉండటం వలననే అది తెలియబడుతూ ఉంటుంది. ఏమండీ రెండు ఉంటే ఆనందం, రెండు ఉంటే సంతోషం ఉన్నది ఒక్కటే అయితే ఆనందం ఏమిటి అని మీరు అనుకోవచ్చు. ద్వితీయం నశిస్తే మీ ఆనందానికి ఇబ్బందిలేదు. మీలోపలఉన్న సత్యవస్తువు దానిని అదే ఎంజాయ్‌చేస్తూ ఉంటుంది. అప్పుడు మీరు ముగింపులేని ఆనందంలో, శాంతిలో మునిగిపోతారు, ఈ శరీరం ఉండటం లేకపోవటంతో పనిలేదు. అందుచేత మనం కాలాన్ని సద్వినియోగం చేసుకొంటూ మనస్సును ప్రిపేర్ చేసుకోవాలి, భక్తిని పెంచుకోవాలి. ఎవడైతే నిరంతరం ఆత్మచింతన చేస్తున్నాడో, దైవచింతన చేస్తున్నాడో వాడి యోగక్షేమములను భగవంతుడు చూసుకొంటాడు. కొంతమంది మహాత్ముల దగ్గర కూర్చొంటే మన మానసికవత్తిడి తగ్గిపోతుంది, మన సాధనతో సంబంధం లేకుండానే వారి వైబ్రేషన్స్ మనమీద పనిచేయటం వలన మన మనస్సు చల్లబడుతుంది. పులి దగ్గరకు మేకలు రావు అలాగే భక్తి అనే పులిని పోషించుకొంటే రాగద్వేషాలు, కోరికలు, కోపాలు అనే మేకలు మీ దగ్గరకు రావు అని మధ్వాచార్యులు చెప్పారు. భక్తిని పోషించుకొంటే అసలుమీకు నెగిటివ్‌గా ఆలోచించే దృక్పథమే పోతుంది. ఇతరుల గొడవ మనకు అనవసరం, వారి ప్రారబ్ధాన్ని బట్టి వారు ప్రవర్తిస్తూ ఉంటారు. మనం సమానబుద్ధిని కాపాడుకొంటూరావాలి, డివైనిటీని పెంచుకొంటూరావాలి. డివైనిటీని పెంచుకొంటూవస్తే మనకు స్టెబిలిటీ వస్తుంది అంటే ఏకాగ్రత వస్తుంది. ఏకాగ్రత కనుక మనం సంపాదిస్తే అన్నీ సాధించినట్లే. మా దగ్గరకు వచ్చేవారు అందరూ శాంతి కావాలి అని అడుగుతూ ఉంటారు. మన బట్టలకు, శరీరానికి మురికి అంటుకోకుండా ఎంత జాగ్రత్తగా ఉంటామో, అంత జాగ్రత్తగా మన మనస్సుకు మురికి అంటుకోకుండా చూసుకొంటే,

అంటే మన మనస్సును పవిత్రంగా ఉంచుకొంటే అసలు అశాంతి మీ దగ్గరకు రాదు. అశాంతి వస్తోంది అంటే లోపల మనస్సులో ఏదో దోషం ఉంది, అది ఉందని అస్తమాను అనుకోవటం కాదు, ఆ బలహీనత ఏమిటో తెలుసుకొని, దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయాలి. మనకు ఏ బలహీనత ఉందో ఆ బలహీనత లేనివారితో సహవాసం చేయటం వలన అది రెడ్యూస్ అయిపోతుంది. హోలీ కంపెనీ వలన మన మనస్సులో ఉన్న డస్ట్ అంతా రాలిపోతుంది.

ఎక్కడో ఆత్మజ్ఞానం మాట అటు ఉంచండి ముందు మనకు శాంతి కావాలంటే మనస్సులో చెడ్డఉద్దేశ్యం పెట్టుకొని మాట్లాడకూడదు, పనులు చేయకూడదు, మనకు చెడుతలంపులు రాకుండా చూసుకోవాలి. మనం ఏమనుకొంటున్నాము అంటే పూజ గదిలో జాగ్రత్తగా ఉంటే సరిపోతుంది అనుకొంటున్నాము, మన సాధనను పూజగదికి పరిమితం చేస్తున్నాము. మన ప్రార్థనకు విలువ ఉంది, మంచి మనస్సుకు విలువ ఉంది. మనస్సులో దోషం లేకుండా భగవంతుడిని ప్రార్థించండి, మీరు ఏది అడిగితే అది ఇస్తాడు, భగవంతుడు అంటే కల్పతరువు. భగవంతుడు ఇలా చేసాడు ఏమిటి అని మనకు ఒకోసారి అనిపిస్తుంది. భగవంతుడు చేసిన దానిని మనం ఇష్టం చేసుకోవాలి. భగవంతుడు అలా ఎందుకు చేసాడో, మన జీవితాన్ని ఎక్కడ మలుపుతిప్పుతాడో మనకు తెలియదు, మనలో ఉన్న బలహీనతలను తొలగించుకోవటం కోసం భగవంతుడు కొన్ని సంఘటనలను క్రియేట్ చేస్తూ ఉంటాడు. మన హృదయంలో ఉండి దేహప్రారబ్ధమును బట్టి మనలను ఎవడైతే నియమిస్తున్నాడో వాడే ఈ సృష్టినంతా నియమిస్తున్నాడు, ఈ దేవతలను, పంచభూతాలను నియమించేవాడు కూడా ఆయనే, వాడు వీడు ఒక్కటే. ఆ ఒన్‌నెస్‌ను మనం మిస్ అవ్వకూడదు. ఆ వన్‌నెస్‌ను మనం దృష్టిలో పెట్టుకుంటే ఆదేవుడు ఎక్కువ, ఈదేవుడు తక్కువ అనే భావన మనకు రాదు. మీరు సబ్జక్టును బాగా అర్థం చేసుకోండి, మహిమల జోలికి వెళ్ళవద్దు. భగవంతుడి దయవలన మీకు ఏదైనా మహిమలు జరిగితే అది వేరే విషయం అంతేగాని వాటికోసం ఎదురుచూడవద్దు. మహిమల కోసం ఎదురుచూస్తూ ఉంటే మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. అందుచేత జీవితంలో భగవంతుడు మనకు ఏది ఇచ్చినా అది ఆయన ప్రసాదం కింద స్వీకరించాలి. అప్పుడు ఆయన దయకు పాత్రులవుతాము. ఎప్పుడయితే ఆయన దయకు పాత్రులమయ్యామో ఆత్మజ్ఞానంతోటి మనలను అలంకరిస్తాడు. పరమేశ్వరుడి ఎడమభాగం గౌరి అని, అర్ధనారీశ్వరుడు అని చెపుతారు. మార్కండేయుడు శివభక్తుడు. మార్కండేయుడికి ఆయుష్షు 16 సంవత్సరాలు. మార్కండేయుడికి 16 సంవత్సరాలు అయిన వెంటనే యమధర్మరాజు ఆయన డ్యూటీ ప్రకారం అతని ప్రాణాన్ని తీసుకొని వెళ్ళటంకోసం వస్తాడు. కాని మార్కండేయుడు శివుడిని ఆశ్రయించాడు, శివుడిని కౌగిలించుకొని ఉన్నాడు, ఒకోసారి మనం కూడా పెద్దవారిని ఆశ్రయిస్తే మనకు వచ్చే ప్రమాదం తగ్గుతుంది. మార్కండేయుడు శివుడిని పట్టుకొని ఉన్నాడు. యమధర్మరాజు పాశం ఎలా వెయ్యాలో తెలియక శివుడిని కూడా చుట్టబెట్టేస్తాడు. అప్పుడు

శివుడు ఎడమకాలితో యమధర్మరాజును తన్నుతాడు. మార్కండేయుడి ప్రాణం నిలబడుతుంది. నీవలన యమధర్మరాజుకు అగౌరవం జరిగింది అని ఎవరో మార్కండేయుడిని అడుగుతారు. అప్పుడు మార్కండేయుడు అంటాడు నావలన ఆయనకు అగౌరవం రాలేదు, బలం వచ్చింది అన్నాడట. శివుడి యొక్క ఎడమభాగం శక్తి. శివుడు ఎడమకాలితో తన్నాడు అందువలన యమధర్మరాజుకు పూర్వం ఉన్నశక్తి కంటే ఇప్పుడు శక్తి పెరిగింది అని చెప్పాడు. పైకి చూడటానికి యమధర్మరాజును అగౌరవ పరచినట్లుగా ఉంది కాని ఆ వంపుమీద ఆయన శక్తిని పెంచాడు, యమధర్మరాజు యొక్క వైభవాన్ని పెంచాడు అని మార్కండేయుడు చెప్పాడు. లోచూపుతో చూస్తే అది పరాభవం కాదు, యమధర్మరాజు యొక్క వైభవం పెరిగింది, శక్తి పెరిగింది. మనకు ఎటువంటి తలంపులు వస్తున్నాయో జాగ్రత్తగా చూసుకోవాలి. మనకు మంచిది కాదు అనుకొన్నది ఇతరులకు కూడా చేయకూడదు. మనకు ఏదైతే మంచి అనుకొంటున్నామో అదే ఇతరులకు చెయ్యాలి, అలా పదిరోజులు చేసి చూడండి, మీకు తట్టుకోలేనంత శాంతి వస్తుంది. మనం గ్రౌండ్ రియాలిటీస్ వదిలేయకూడదు. వాటిని కొంచెం దృష్టిలో పెట్టుకొంటే మనస్సు అణుగుతుంది, తరువాత దానికి లోచూపువస్తుంది, శాంతిలో మీబుద్ధి స్థిరపడుతుంది. అలా స్థిరపడిన బుద్ధి సత్యాన్వేషణకు ఫిట్ అవుతుంది. అప్పుడు మీదైనందిన జీవితం చాలా క్వయిట్‌గా, కూల్‌గా వెళ్లిపోతుంది. ఎదుటివారు మిమ్మల్ని ఉద్రేకపరచటానికి చూసినా మీరు ఉద్రేకరహితంగా ఉన్నారు అనుకోండి అప్పుడు మీలో ఏమైనా దోషాలు ఉంటే భగవంతుడు వారికి ట్రాన్స్‌ఫర్ చేసేస్తాడు. మనం గౌరవాన్ని పెంచుకొంటూ వెళతాము అనుకోండి లేకపోతే డబ్బును పెంచుకొంటూ వెళతాము అనుకోండి బుద్ధిని పెంచుకోము అనుకోండి చివరకు అశాంతి మిగులుతుంది. మీకు శాంతి లేనప్పుడు ఆ గౌరవాలు ఏమి చేసుకొంటారు, మీ బుద్ధిపాడైపోయిన తరువాత మీకు ఉన్న సంపదను ఏమి చేసుకొంటారు. మనకు ఇష్టం ఉన్నా, ఇష్టం లేకపోయినా మన ఇష్టాలను, అయిష్టాలను ప్రక్కన పెట్టి భగవంతుడికి ఇష్టమైన పనిని మనం చేయటం వలన మనస్సు నశిస్తుంది. మనస్సు నశిస్తే మనోమూలంలో ఉన్న వస్తువు మనకు తానుగా వ్యక్తమవుతుంది. సూర్యుడికి చీకటి కనబడదు అలాగే జ్ఞాన సూర్యుడు అనుభవంలోనికి వచ్చినవాడికి దుఃఖం కనబడదు, వాడికి అసలు దుఃఖస్పర్శే ఉండదు. లోపల ఏమాత్రం అజ్ఞానం ఉన్నా, అవిద్య ఉన్నా, ముల్లంత అహంకారం ఉన్నా వాడికి దుఃఖం వచ్చి తీరుతుంది. శరీరం కూడా నీడ ఏవిధంగా వెంటాడుతుందో అజ్ఞానం కూడా, అవిద్య కూడా బంధం వెంటాడుతుంది, దుఃఖం వెంటాడుతుంది, పునర్జన్మలు వెంటాడతాయి.

మీరు ఎవరినయినా నల్లగా ఉన్నారు అంటారు అనుకోండి, వారికి దుఃఖం వచ్చేస్తుంది. ఎందుచేతనంటే వాడికి ఆ దేహంతో తాదాప్యం ఉంటుంది. ఆ దేహంతో

వాడికి తాదాప్యం లేదు అనుకోండి, మీరు నల్లగా ఉన్నారు అని వాడిని అన్నా వాడికి దుఃఖం రాదు. నువ్వు ఎవరిగా ఉన్నావో అలా ఉన్నప్పుడు నువ్వు నల్లగా ఉన్నావు అన్నా ఆ మాట అసలు అంతదూరం వెళ్ళదు, ఇక్కడే రాలిపోతుంది, లోపలకు వెళ్ళి తగలదు, లోపలకు వెళ్ళి తగిలినప్పుడు కదా దుఃఖం వచ్చేది. మన హిందూమతంలో పూజలు ఎక్కువ, సబ్జక్టు వినటం తక్కువ. నువ్వు పూజ ఎందుకు చేస్తున్నావు, జపం ఎందుకు చేస్తున్నావు. ఆలోపల ఉండి చేసేవాడు ఎవడు? వాడి గురించి ఎప్పుడైనా ఆలోచిస్తున్నావా? వాడి గురించి ఎప్పుడైనా విచారణ చేస్తున్నావా? ఈ పూజ, జపం, ధ్యానం మనస్సును పవిత్రం చేయటానికి సహకరిస్తాయి. బాహ్యంగా ఏదోచేయటం వలన ఆత్మజ్ఞానం కలుగదు. నువ్వు లోపల బాగుపడాలి, లోపల అంతస్థు పెంచుకొంటూ రావాలి. మనస్సు బాగా పక్వానికి రావాలి. మీ మనస్సుకు ఏకాగ్రత వచ్చేకొలది, పవిత్రత వచ్చేకొలది మీకు తెలియకుండానే అది ఎక్కడ నుండి అయితే వచ్చిందో అక్కడకు జారిపోతూ ఉంటుంది. మనస్సు ఎక్కడ నుండి అయితే వచ్చిందో అక్కడకు వెళ్ళి మిళితమైనప్పుడు మనం ఏదో పోగొట్టుకొంటున్నామా అని మనకు అనిపిస్తుంది కాని మనం ఏమీ పోగొట్టుకోము, మనం ఎవరిమో మనకు తెలియబడుతుంది. మనం దేహానికి, మనస్సుకు పరిమితమై పోతున్నాము. ఈ దేహగతమైన జీవితాన్ని, మనోగతమైన జీవితాన్ని ఓవర్‌కమ్ చేయాలి. వీటికి అతీతంగా ఏదో ఉందని కూడా మనకు తెలియటం లేదు. మనం ఎన్ని సంవత్సరాలు బతికినా ఏదో బట్టలు కట్టుకొంటున్నాము, అన్నంతింటున్నాము, సినిమాలకు వెళుతున్నాము ఇలా కాలక్షేపం చేస్తున్నాము అంతే నా జీవితం. అలాగనిఅన్నం తినవద్దనికాదు, బట్టలు కట్టుకోవద్దని కాదు. మీకు ఇష్టమైతే సినిమాలకు వెళ్ళండి అదేనా జీవితం. నేను చెప్పేది జపం చెయ్యవద్దు అనికాదు, పూజ చెయ్యవద్దు అని కాదు అంతేనా జీవితం, అదే నా గమ్యం. మన మనస్సు ఎంత బలహీనంగా ఉంది అంటే ఎవడో చేత్తో ఇలా పసుపు తీసి చూపిస్తాడు ఆ ఎంత గొప్పగా ఉంది అనిపిస్తుంది. ఇంకొకడు చేత్తో ఇలా కుంకుమ తీసి చూపిస్తాడు, ఎంత గొప్పగా ఉంది అనిపిస్తుంది. గారడీవాడు నేను డబ్బులు తెప్పిస్తాను చూసుకోండి అని డబ్బా అలా అంటాడు, ఇలా అంటాడు రూపాయలు వచ్చేస్తాయి. అన్ని రూపాయలు సృష్టించేవాడు మరల మనలను రూపాయి అడగటం ఏమిటి? ఇటువంటివి అంటే మనం ఇష్టపడుతున్నాము గాని మన హృదయంలో ఏముందో దానిని తెలుసుకోవటానికి మనం ఇష్టపడటం లేదు. భక్తులుకానివారిమాట వదిలేయండి, భక్తులు కూడా ఇలాగే ఉన్నారు, ఇవన్నీ మనస్సును పెంచుకోవటం, ఇలా ఎంత కాలం మనస్సును పెంచుకొంటావు. నీకు పసుపు కావాలంటే పసుపు కొమ్ములు ఆడించుకోవచ్చు కదా. ఎందుకు చెపుతున్నాను అంటే ఇది వివేకరహితమైన జీవితం. భక్తిపేరు చెప్పి చాలామంది రాళ్ళకు ఖర్చు పెట్టేస్తున్నారు. ఒక ఊరు ఉందంటే 20 రామాలయాలు ఎందుకు? రామాలయం కడతాడు తలుపులు వేసేస్తాడు, శ్రీరామనవమి రోజున తలుపులు తీస్తాడు. రాతి మనస్సు ఉన్నవారు రాళ్ళంటేనే ఇష్టపడతారు అని భగవాన్ చెప్పారు. విగ్రహారాధన

ఎందుకు పెట్టారు అంటే నిగ్రహం కోసం మన పెద్దలు ఏర్పాటుచేసారు. నీవు బాహ్యంగా ఏదో చేయటం వలన నీకు ముక్తిరాదు. నీవు బాహ్యంగా చేసే పనుల వలన పుణ్యమో మరొకటో మరొకటో రావచ్చు. చిత్తాన్ని శోధించటం వలన, హృదయం యొక్క లోతులను పెంచుకోవటం వలన మనస్సును పవిత్రంచేసి, ఏకాగ్రం చేసి దానిని ఉపసంహరించి దాని మూలంలోనికి మనస్సును నెట్టటంవలన నీకు మోక్ష సుఖం అందుతుంది అంతేగాని ఏదో చేయటం వలన ఇదిరాదు. చిత్తాన్ని శోధించటం వలన అది దాని మూలంలోనికి వెళ్ళి అది నశిస్తుంది, అప్పడు అక్కడ ఉన్న సద్వస్తువు నీకు ఎరుకలోనికి వస్తుంది. అప్పడు స్వతంత్ర్యమైన ఆనందం నీకు అందుతుంది. ఇంక ఆనందం కోసం నీవు బయట వ్యక్తుల మీద, పరిస్థితుల మీద ఆధారపడనక్కరలేదు. ఉన్న పురుషార్థం అల్లా ఒక్కటే, అదే మోక్షం, దానినే మనం గమ్యంగా పెట్టుకోవాలి. మధ్యలో మనం ఫెయిల్ అవుతూ ఉండవచ్చు, కాని ఆ ఫెయిల్ అవ్వటంలో కూడా మనకు శక్తి వస్తూ ఉంటుంది. ఫెయిల్ అయ్యామని ఎవరైనా అంటే మనం ఇన్‌సల్ట్ ఫీల్అవ్వకూడదు, దానిని మనం భరించగలగాలి. మిమ్మల్ని ఎవరైనా అవమాన పరుస్తారు అనుకోండి దానికి మీరు ఉద్రేకపడితే మీకు సాధనాబలం లేదు అని అర్థం. ఒకటి గుర్తుపెట్టుకోండి పరమపవిత్రుడు కానివాడికి, పరిపూర్ణమైన ఏకాగ్రత లేనివాడికి వాడు ఏమతస్థుడయినా, ఏకులస్థుడయినా సత్యవస్తువు ఎరుకలోనికి రాదు, వచ్చే అవకాశం లేదు. ఎందుచేతనంటే మనం సమాజాన్ని మోసం చేయగలము గాని అంతర్యామిగా ఉన్న భగవంతుడిని మనం మోసం చేయలేము. నువ్వు చేసే సాధనలో మనస్సును ఇన్‌వాల్వ్ చేయాలి. నువ్వు పోగొట్టుకోవలసింది మనస్సును అందుచేత నీ సాధనలో మనస్సును ఇన్‌వాల్వ్ చేయాలి. మనస్సును ఇన్‌వాల్వ్ చేయకుండా ఏదో చేస్తున్నాను అంటే ఎలా కుదురుతుంది.

నీకు ఎన్ని తలంపులు వచ్చినా రానియ్యి, కంగారుపడిపోయి వాటిని సప్రస్ చేయటానికి చూడవద్దు. తలంపులు అలా వస్తూ ఉంటాయి. ఈ తలంపులు అన్నీ ఎవరికి వస్తున్నాయి? నేనుకు వస్తున్నాయి. ఈ నేను ఎవరు అని ప్రశ్నించు. ఈ నేనును విచారణ చెయ్యి. ఎంత పెద్ద గుమ్మడికాయ అయిన కత్తిపీటకు లోకువ అలాగే నీకు ఎన్ని తలంపులు వచ్చినా రానియ్యి విచారణముందు అవన్నీ కాలిబూడిద అయిపోతాయి. అందుచేత విచారణ విడిచిపెట్టవద్దు. మనకు ఏదైనా తలంపు వస్తుంది, ఆ తలంపు కూడా వెళ్ళిపోవద్దు. ఆ తలంపు ఎవరికి వస్తోంది అని ప్రశ్నించు? నేనుకు వస్తోంది. ఈ నేనును విచారణ చేసే కొలది అది లోపలకు ఉపసంహరింపబడుతూ ఉంటుంది అప్పడు దానికి వచ్చే తలంపులు అన్నీ చెట్టు నుండి ఆకులు రాలిపోయినట్లు రాలిపోతాయి. నీకు ఉపయోగంలేని తలంపులు అనేకం వస్తూ ఉంటాయి. తలంపుకు ప్రత్యేకంగా బలం లేదు, దాని గురించి ఆలోచించే కొలది దానికి బలం వస్తుంది, దాని గురించి ఆలోచించటం మానివేస్తే ఏమీ లేదు. ఆ తలంపులకు బలం ఇచ్చేది నువ్వే, మరల వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేసేది

నువ్వే ఇప్పుడు మనకు శరీరం తెలుస్తోంది, మనస్సు తెలుస్తోంది. గాఢనిద్రలో మనం ఈ రెండింటిలో నుండి విడిపోతున్నాము. గాఢనిద్రలో మనం ఆనందంగా, శాంతిగా ఉన్నాము. ఎందుచేతనంటే అక్కడ మనం మనంగా ఉన్నాము, మనం కానిదానిలో నుండి విడిపోయాము. ఆగాఢనిద్రలో ఉన్న స్థితిని మనం జాగ్రదవస్థలోనికి తెచ్చుకోవాలి. మీ దేహ యాత్ర జరగటానికి తగిన పని ఏదో మీరు చేసుకోండి. నీ వృత్తి అడ్డుకాదు అహంవృత్తే నీకు అడ్డు. పని అడ్డుకాదు ఆపని నేను చేస్తున్నాను అనే తలంపే నీకు అడ్డు వస్తుంది. నీకు చూడటం అంత సరదాగా ఉంటే నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూడు అనేవారు భగవాన్. నిన్ను నీవు చూసుకొని లోకాన్ని చూస్తే లోకం నిన్ను బంధించదు. నిన్ను నీవు చూసుకోకుండా లోకాన్ని చూస్తే నువ్వు లోకంతో బంధింపబడతావు, లోకవాసన పెరిగిపోతుంది. నీకు లోపల ఉన్న వస్తువు లభ్యమయితే దానిముందు ఈ సృష్టి అంతా ఏపాటిది అన్నారు భగవాన్. హృదయంలో ఉన్న వస్తువు తాలుక అనుభవం నీకు కలిగినప్పుడు దానిముందు ఈ ప్రపంచంలో ఉన్న సంపదే కాదు, అసలు మొత్తం ఖగోళం అంతా కూడా సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు, ఈ భూమి, సృష్టి అంతా కూడా ఏపాటిది. ఆశ్చర్యం ఇది. ఇవి ఏమీ చిలుక పలుకలు కాదు. ఆ రీలైజేషన్ యొక్క వైభవం మనకు ఎరుకపరచటానికి అక్కడ ఎంత బలం పెట్టుకొని ఈ మాటలు చెపుతున్నాడో చూడండి. ఒకడికి జ్ఞానం కలిగింది అనుకోండి, జ్ఞానం యొక్క వైభవం ఏమిటి అంటే మిమ్మల్ని అందరినీ జ్ఞానంలోనికి తీసుకొనిపోవాలి అని చూస్తాడు. మనం బజారులో వస్తువు కొనాలంటే మూల్యం చెల్లించాలి కాని మూల్యం చెల్లించనక్కరలేకుండా అందరినీ జ్ఞానంలోనికి తీసుకొనిపోవాలి అని వాడికి అనిపిస్తుంది. అది నేచురల్ ఆ పొంగు వచ్చేస్తూ ఉంటుంది. మీరు ఏదైనా అశాంతిలో ఉన్నారు అనుకోండి, ఆ అశాంతిని పగులకొట్టేయాలి అని వాడికి అనిపిస్తుంది. గౌతమబుద్ధుడి జీవితం చూస్తే ఆయన మహారాజు కాని వర్షానికి తడిసి, ఎండకు ఎండి ఊరూర తిరిగాడు, ఇంటింటికి తిరిగాడు. బాహ్యంగా ఆయన పొందిన ప్రయోజనం ఏమిటి సున్నా. ప్రేమించకుండ ఉండలేక, జ్ఞానాన్ని పంచిపెట్టటంకోసం, ఆనందాన్ని శాంతిని పంచిపెట్టటం కోసం ఇంటింటికి తిరిగాడు, ఇది వేసవికాలం, ఇది వర్షాకాలం అని ఎరుకలేకుండా తిరిగాడు. బుద్ధగయలో ఆయన నిర్వాణస్థితిని పొందాక మనం పొందవలసింది ఏదో పొందాము అని ఆ ఆనందాన్ని, శాంతిని జుర్రుకుంటూ ఆ మహదానందంలో 48 రోజులు అలాగే ఉండిపోయాడు. ఆ తరువాత స్ట్రగుల్ ప్రారంభమయింది, నీవు పొందుతున్న అలౌకికమైన ఆనందంలో, శాంతిలో ఎవరికి వాటా ఇవ్వవా అని లోపల నుండి ప్రేరణ వచ్చింది. ఏ ఈశ్వరుడి దయవలన ఆయనకు జ్ఞానం కలిగిందో ఆ ఈశ్వరుడే మరల ఈ ప్రేరణ కూడా కలుగజేస్తున్నాడు. ఆయన పొందిన నిర్వాణస్థితిని మనచేత పొందింపజేయటానికి, ఆయన పొందిన ఆనందాన్ని శాంతిని మనకు పంచిపెట్టటానికి అప్పుడు ప్రయాణం ప్రారంభించాడు. అంతకంటే ఇంకోపని లేదు, మధ్యవర్తులతో ఏమీ సంబంధం లేకుండా ఈ జీవుడిని డైరెక్టుగా బ్లిస్‌లోనికి పంపటానికి

ప్రయత్నం చేసాడు. బుద్ధుడు చెప్పిన ఒక వాక్యం నన్ను బంధిస్తుంది అది ఏమిటి అంటే బుద్ధుడు శరీరం చనిపోయే ముందు ఈ శరీరాన్ని ఏమి చేయమంటారు అని ఆనంద్ బుద్ధుడిని అడుగుతాడు. ఇప్పుడు మనం ఉన్నది ఒక గ్రామమే కదా. ప్రతీ గ్రామంలో స్మశానం ఉంటుంది కదా. ఈ గ్రామంలో ప్రతీ శవాన్ని ఏ స్మశానంలో దహనం చేస్తున్నారో? ఈ శరీరాన్ని కూడా అక్కడకు తీసుకొని వెళ్లి దహనం చెయ్యి అంతేగాని బుద్ధుడు ఫలానా చోట చనిపోయాడు అని గుర్తుకూడా అక్కరలేదు అని చెప్పాడు. వారు ఎంతో మంచి చేసి కూడా యశస్సు కోరటం లేదు, మనం మంచి చేయకుండానే యశస్సు కోరుకొంటాము. ఇప్పుడు మనం చేయవలసింది ఏమిటి అంటే మనకి ఏది మంచి అనుకొంటే అదే ఇతరులకు చేయాలి, ఇతరులతో మాట్లాడేటప్పుడు ప్రీతితో, ఆప్యాయతతో మాట్లాడాలి, వారి ఫీలింగ్ హర్ట్ అవ్వకుండా చెప్పాలి.

### సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 14-11-04, పాలకొల్లు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఉన్నది ఒక్కటి అంటే ఒక్కటే, అదే బ్రహ్మం. ఆ బ్రహ్మమే మనకు ఈశ్వరుడుగా కనిపిస్తోంది, ఆ బ్రహ్మమే మనకు గురువుగా కనిపిస్తోంది, ఆ బ్రహ్మమే మనకు జీవుడిగా కనిపిస్తోంది. దాని స్వరూపమే సుఖం, శాంతి, ఆనందం, దాని స్వరూపమే ఉండటం. అన్ని ఆనందాలలో బ్రహ్మానందం గొప్పది. దానిని పొందినప్పుడు ఇంద్రియాల ద్వారా పొందే సుఖం, మనస్సు ద్వారా పొందే సుఖం, శరీరం ద్వారా పొందే సుఖం అన్ని సుఖాలు అందులో ఇమిడిపోతాయి. మీకు వేలాది కోర్కెలు ఒక్క క్షణంలో నెరవేరిపోతే ఎంత ఆనందం వస్తుందో దానికి మించిన ఆనందం బ్రహ్మంలో ఉంది. అందుచేత బ్రాహ్మీస్థితిని పొందినవాడిని పూర్ణకాముడు అంటారు. అన్ని కోరికలు నెరవేరిన వాడు మాత్రమే ఏ కోరిక లేకుండా పనిచెయ్యగలడు. ఒక్క పూర్ణకాముడు మాత్రమే నిష్కాముడుగా ఉండగలడు. ప్రతీమానవుడికి వాడు ఏమతస్థుడైనా వెలితిలేని పూర్ణస్థితిని పొందాలని ఉంటుంది. కబీరుదాసు ఏమి చెప్పారు అంటే మీకు భగవంతుడు, గురువు ఒక్కసారే కనపడ్డారు అనుకోండి ముందు గురువుకు నమస్కారము పెట్టి తరువాత భగవంతుడికి నమస్కారం పెట్టండి అని చెప్పారు. ఎందుచేతనంటే మనలో ఉన్న అజ్ఞానాన్ని తొలగించేవాడు, మన అహంభావనను బయటకు లాగి కాల్చి బూడిదచేసేవాడు, మనకు గమ్యం తెలియకపోయినా, మన గమ్యాన్ని తెలియజేసి అక్కడకు తీసుకొని పోయేవాడు, మనలో ఏమైనా చీకటికోణాలు ఉంటే అవి మన బుద్ధికి అందేలా చేసి మన బుద్ధికి తగిన శక్తిని ఇచ్చి ఆ చీకటిలో నుండి మనలను విడుదల చేసి భగవంతుడి దగ్గరకు చేర్చేవాడు, మన క్షేమాన్ని కోరేవాడు, మోక్ష ప్రదాత, శాంతి ప్రదాత గురువు మాత్రమే. అందుచేత గురువుకు ముందు నమస్కారం పెట్టండి అని కబీరు చెప్పారు. మన దేశంలో పని దొంగలు ఎక్కువ. పనిమానివేస్తే జ్ఞానం

వచ్చేస్తుంది, పని మానివేస్తే భక్తి కలుగుతుంది అనుకొంటారు. అలాకాదు, మనం ధర్మాన్ని ఆచరించాలి, శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకొని మన డ్యూటీ మనం చేయాలి. చెయ్యవలసినవి విడిచిపెట్టకూడదు, చెయ్యకూడనివి చెయ్యకూడదు. ఒక పని ధర్మవిరుద్ధం అని మీరు అనుకొన్నప్పుడు దానికి దూరంగా ఉండాలి. సదాచారాన్ని విడిచిపెట్టకూడదు, దురాచారానికి దూరంగా ఉండాలి. కర్మ అంటే సదాచారం, వికర్మ అంటే దురాచారం. మనపని మనం శ్రద్ధగా చేసుకోవాలి, ఇతరుల వ్యవహారాలలో సాధ్యమైనంతవరకు కలుగజేసుకోకూడదు. మనం ధర్మాన్ని ఆచరించకపోతే మనస్సు నశించదు. కుయుక్తులవలన, కుతంత్రాలవలన, కుకర్మలవలన మనస్సు నశించదు. నిష్కామకర్మ చేసేవాడు వాడు పని చేస్తున్నా చెయ్యని వాడితో సమానము ఎందుచేతనంటే వాడిని కర్మ చుట్టుకోదు, వాడికి చిత్తశుద్ధి కలుగుతుంది. వాడు యోగి అవుతాడు. గీతలో ఎక్కడా కర్మను విడిచిపెట్టమని భగవంతుడు చెప్పలేదు. ఒకవేళ మీరు చేయవలసిన పనిని విడిచిపెడితే రాబోయే జన్మలో వడ్డీతో సహా ఆపనిని మీచేత చేయిస్తాడు. మనం ఎప్పటికప్పుడు ఋణవిముక్తులు అవ్వటమే మంచిది. ఎదుటివారు మంచివారా, చెడ్డవారా అనేది మనకు అనవసరం, మన డ్యూటీ మనం చేయాలి. వికర్మ అంటే నిషిద్ధకర్మ దానికి మనం దూరంగా ఉండాలి. కొంతమంది మంచికర్మ చేసినా కుయుక్తితో, కుతంత్రంతో చేస్తారు, దానిని కుకర్మ అన్నారు. మనం మాట్లాడే మాట, మనకు వచ్చే తలంపులు మనం అహంభావరహితస్థితిని పొందటానికి సహకరించాలి. మనకు ఎంతోకొంత భక్తి ఉంది, జ్ఞానం ఉంది, జపం ఉంది. ఒక డాక్టరు బాగా చదువుకొన్నాడు అనుకోండి ఆయన తెలివితేటలు, నేర్పు ఆపరేషన్ చేయటంలో చూపించాలి. అలాగే మనకు ఉన్న భక్తి యొక్క విశేషం, జ్ఞానం యొక్క విశేషం, జపం యొక్క విశేషం కర్మ చేయటంలో చూపించాలి అప్పుడు మనకు సమగ్రత వస్తుంది. మన హృదయంలోనే సద్వస్తువు ఉంది కాని మనకు దేహం పట్ల ఉన్న అభిమానం మనస్సును లోపలకు వెళ్ళనీయటం లేదు. గౌతమబుద్ధుడు, రమణమహర్షి ఇంకా చాలామంది మహర్షులు బిక్ష చేసుకొన్నారు. బిక్ష చేసుకొన్నప్పుడు కూడా వారు మహాజ్ఞానులే. వారిని వారు పరీక్ష చేసుకోవటానికి కొన్నాళ్ళు బిక్ష చేసుకొన్నారు. మనం వారిని తిట్టినా అవి వారిని అంటవు. వారు ఎక్కడ ఉన్నారో? మనోదేహములకు అతీతంగా, లోకానికి అతీతంగా, దేవుడికి అతీతంగా ఉన్నారు. ఆ దూరం వెళ్ళినవాడికి ఆ అంతస్థు తెలుస్తుంది, వారి వైభవం తెలుస్తుంది. మనం బిక్షకు వెళ్ళినప్పుడు దున్నపోతులా ఉన్నావు, పనిచేసుకోలేవా అంటారు. అందరు తలోరకంగా తిడతారు. అందరిచేత తిట్లు తిన్నప్పుడు మన మనస్సు సమానంగా ఉందో లేదో చూసుకోవటానికే బిక్ష మనం అహంభావరహితస్థితిని పొందటానికి అది ఒక ట్రైనింగ్.

రమణమహర్షిగారికి బాహ్యంగా గురువులేకపోవచ్చు అరుణాచలేశ్వరుడే ఆయనకు గురువు, దైవము. మనలో మంచి ప్రవృత్తి లేదు అనుకోండి, మనలో మంచి గుణాలు లేవు

అనుకోండి వాటిని ప్రసాదించేవాడు గురువు. మనచేత సత్కర్మ చేయించేవాడు, మనకు మంచి సంకల్పాలు తీసుకొని వచ్చి వాటిని పోషించేవాడు గురువు. మనకు మంచి సంకల్పాలు రాకుండా ఏవైనా దుష్ట ఆలోచనలు అడ్డు వస్తూ ఉంటే వాటిని తొలగించేవాడు గురువు, అంతా గురువే. మనకు డబ్బులేకపోతే డబ్బు ఉంటే సుఖపడిపోతాము అనుకొంటాము, మనకు పదవి లేకపోతే పదవి ఉంటే సుఖపడిపోతాము అనుకొంటాము, చదువులేకపోతే చదువు ఉంటే సుఖపడిపోతాము అనుకొంటాము కాని భగవంతుడు ఏమి చెపుతున్నాడు అంటే నీ హృదయంలో ఒక చావులేని సత్యవస్తువు ఉంది. దాని స్వరూపమే సుఖం, దాని స్వరూపమే ఆనందం, అక్కడకు వెళ్లమని చెపుతున్నాడు. ధనంలోని, విద్యలోని సుఖం ఉంటే ధనంలోని, విద్యలోని సుఖం ఉందని భగవంతుడు చెప్పేవాడు కాని అక్కడ సుఖంలేదు, ఈ విద్యలు అన్నీ మన దేహయాత్రకు పనికివచ్చేవి మాత్రమే. ఒక్క ఆత్మవిద్య వలన మాత్రమే ఆత్మ తెలియబడుతుంది. ఏ వస్తువును తెలుసుకొన్నాక నీవు దుఃఖరహిత స్థితిని పొందుతావో ఆ వస్తువును తెలుసుకో, రాగద్వేషములను తగ్గించుకో, ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండు, నీ దేహాన్ని మనస్సును కండిషన్‌లో పెట్టుకొని ఆత్మజ్ఞాన సముపార్జనకు వాటిని ఉపయోగించుకో. నువ్వు పొందవలసింది ఈ దేహం భూమి మీద తిరుగుతూ ఉండగానే పొందు. భగవంతుడి వాక్యాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవించు. దుఃఖ కారణం బయటలేదు, దుఃఖం కర్తృత్వరూపంలో ఉంది. ఎక్కడయితే కర్తృత్వం లేదో అక్కడకు మనం చేరుకొంటే దుఃఖరహితస్థితిని పొందుతాము. ఎదుటివారిని అగౌరవ పరచవద్దు, వారిని గౌరవించు. ఎదుటివారిని గౌరవిస్తే నీకు గౌరవం పెరుగుతుంది. ఎదుటివారిని అగౌరవపరిస్తే నీకు అగౌరవం పెరుగుతుంది. ఎదుటివారిని భయపెట్టవద్దు. వారి వలన నీవు భయపడవద్దు. ప్రేమ, మంచి సమానంగా ఉంటాయి. ప్రేమ ఆదివారం ఒకలాగ, సోమవారం ఒకలాగ ఉండదు, అలా రకరకాలుగా ఉంటే అది ప్రేమకాదు, అది కామం. నిజమైన మంచివాడు ఎప్పడూ ఒకరకంగానే ఉంటాడు. కాని చెడ్డవాడు రోజుకు ఒకరకంగా ఉంటాడు. మంచి ఎప్పడూ సమానంగా ఉంటుంది, చెడ్డ సమానంగా ఉండదు. ఎప్పడూ సమానంగా ఉండేది ప్రేమ, హెచ్చుతగ్గులుగా ఉండేది కామం. ఇవన్నీ వారు అనుభవించి మనకు చెప్పినమాటలు. ముందు మానవుడు తన కోర్కెలను తీర్చమని భగవంతుడిని ప్రార్థిస్తాడు. ఆ కోర్కెలు కొన్ని నెరవేరిన తరువాత అందులో ఉన్న నిస్సారత వాడికి తెలుస్తుంది. అప్పడు ఇవేమీ నాకువద్దు, నీదయే నాకు కావాలి అని భగవంతుడిని ప్రార్థిస్తాడు. నాకు ఏది మంచిదో నాకంటే నీకే బాగా తెలుసు, నీ ఇష్టమే నా ఇష్టం, నీ సంకల్పమే నా సంకల్పం, అసలు నేను ఉంటే కదా నువ్వే ఉన్నావు, నేను లేను అని చెపుతూ నువ్వే నేను అనే స్టేజిదాకా ఆ భక్తుడు వెడతాడు. అసలు భగవంతుని దయను సంపాదిస్తే మనం అన్నీ పొందినట్లే. మనమాట, మనస్సు అణగాలి. మనమాట అహంభావన వలన వస్తూఉంటే ఆ మాటను ఆపుచేయాలి లేకపోతే అహంభావన పెరిగిపోతుంది. కొంతమంది

వారి గొప్పలు పదిమందికి తెలియటానికి కోట్లు ఖర్చుపెడతారు ఇతరులకు కనీసం కాఫీకూడా ఇవ్వరు. నీమాట, చేత ఇతరులకు ఉపయోగపడేలా ఉండాలి. అలా నీ జీవితవిధానాన్ని సరిచేసుకోకపోతే జీవితగమ్యమైన బ్రహ్మమును పొందలేవు. మనం ఏదైతే పొందాలి అనుకొంటున్నామో ఆపొందే దానిమీద ఎంత శ్రద్ధ ఉందో, ఎంత ప్రేమ ఉందో దానిని పొందటానికి నీవు చేసే ప్రయత్నంమీద కూడా అంత శ్రద్ధ ఉండాలి, ఆ ప్రయత్నం నీకు ఆనందం కలుగజేయాలి. మన జీవితవిధానంలో ఇంటెలిజెన్స్ బిహేవియర్, ఇంఫెర్సనల్ బిహేవియర్ వలన మనస్సు నశిస్తుంది. మనం ఆడంబరంకోసం, అహంభావనకోసం డబ్బు ఖర్చుపెడితే మనం ఎన్ని పూజలు చేసినా, జపాలు చేసినా ప్రయోజనం లేదు. ఎందుచేతనంటే ఈశ్వరుడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. నువ్వు మాట్లాడేమాటకు, నువ్వు చేసే పనికి సాక్షిగా ఉన్నాడు. నువ్వు ఏ పనిచేసినా వ్రతంగా చెయ్యి అంటే ప్రీతిగా చెయ్యి అని భగవంతుడు చెపుతున్నాడు. ఇద్దరు కాఫీ కాస్తున్నారు అనుకోండి. ఒకడు కాఫీ ఇష్టంగా కాస్తాడు, ఇంకొకడు ఈ కాఫీ గొడవ మనకు వచ్చింది ఏమిటి అని అది ఒక పనిష్‌మెంట్‌గా భావించి చేస్తాడు. అదే పనిని నీవు ఇష్టంగా చేస్తే అది వ్రతం, ఇష్టం లేకుండా చేస్తే అది శిక్ష. నువ్వు ఇంటి దగ్గర చేసేపని, నువ్వు చేసే ప్రతి పనిని వ్రతంగా చెయ్యి, శిక్షగా చెయ్యవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు.

కొంతమందికి 90 సంవత్సరాలు వస్తాయి, వారి మాటలో, పద్ధతిలో 10 సంవత్సరాల పిల్లలలాగా ఉంటారు అంటే మాటలో, చేతలో, ప్రవర్తనలో మెచ్యూరిటీ ఉండదు. బుద్ధిలో ఏమీ వికాసం లేకుండా, చైతన్యస్థాయి ఏమీ లేకుండా, ప్రేమ ఆప్యాయత అంటే ఏమిటో తెలియకుండా 100 సంవత్సరాలు బతికి ఈ శరీరం కనుక చనిపోతే వారిని వెర్రివాళ్ళు అంటారు, అంటే వారి బుద్ధికి పక్వత రాలేదు అని అర్థం. మన బుద్ధికి పక్వత వచ్చే విధంగా మన జీవితాన్ని సరిదిద్దుకోవాలి. మనలను మనమే సంస్కరించుకోవాలి. సంస్కర్తలు కావలెను, సంస్కర్తలు కావలెను ఇతరులను సంస్కరించేవారు కాదు, వారిని వారు సంస్కరించుకొనేవారు కావాలి. ఇతరులలో మార్పు తీసుకొని రావటం కాదు ముందు నువ్వు మార్పు చెందు అని భగవాన్ అంటూ ఉండేవారు. నీ దగ్గర శాంతి ఉంటే అది ఇతరులకు ఇవ్వగలవు. నీ దగ్గర ఏదైనా సమ్‌తింగ్ ఉంటే అది ఇతరులకు ఇవ్వగలవు కానీ నతింగ్‌లోనుండి ఏదీరాదు. మనం భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా మనసు పవిత్రమవుతుంది, అప్పడు లోపల నుండి గైడెన్స్ వస్తూ ఉంటుంది. నీకు మెచ్యూరిటీ వచ్చినప్పడు నీమాట, మనస్సు అణిగిపోతాయి. ఇవిఅన్నీ అణిగిపోయిన తరువాత జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ఇది అంతా ఒక ముద్ద కింద అయిపోతుంది, అప్పడు లోపలఉన్న ఆనందం పొంగివచ్చి నీ సహస్రారాన్ని ముంచుతూ ఉంటుంది. అది అనుభవైకవేద్యము, అప్పడు భగవంతుడు చెప్పిన మాటకు నీ అనుభవానికి సరిపోతుంది. మనం పనికి కూడా ప్రాముఖ్యత ఇవ్వాలి. మనపని ఏదో మనం చేసుకోవటమే కాదు సమాజక్షేమం కోసం

కూడా కొంతవరకు పనిచేయాలి. అలాగ పనిచేయటం వలన అది జ్ఞానోదయానికి మనకు సహకరిస్తుంది. మహాజ్ఞానులందరూ కూడా పనిచేసినవారే. రాముడు, కృష్ణుడు కూడా పనిచేసారు. వారికి మనకు తేడా ఒకటే మనం స్వార్ధం కోసం పనిచేస్తాము, వారు సమాజ క్షేమం కోసం మనకంటే ఎక్కువ కష్టపడి పనిచేసారు. మనం కర్మను యోగంగా చేస్తే ఆ రకంగా కూడా మనం పరమస్థితిని పొందే అవకాశం ఉంది. మీరు 100 సంవత్సరాలు జీవిస్తారు అనుకోండి. ఈ వంద సంవత్సరాల కాలంలో కనీసం ఒక్కగంట నువ్వు అజాగ్రత్తగా ఉంటే, నీ జీవిత విధానంలో ఒక్కగంట నువ్వు రజోగుణంతో, తమోగుణంతో ఉంటే ఈ ఒక్కగంట అజాగ్రత్త నీకు వందజన్మలకు కారణం అవుతుంది అని ఒక ఉపనిషత్‌లో చెప్పారు. దీనిని బట్టి మనం జీవితంలో ఎంత జాగ్రత్తగా ఉండాలో, ఎంత మెలుకువతో ఉండాలో చూసుకోండి. ఈ మాటలు ఒక ఋషి చెప్పినవి. ఇది మనం నమ్మినా, నమ్మకపోయినా నూటికి నూరు పాళ్ళు యదార్థం. ఋషి అంటే చైతన్యాన్ని దర్శించినవాడు. వాడు చైతన్యాన్ని దర్శించి, వాడు అనుభవించి మనలను కూడా ఆ స్థితికి తీసుకొని వెళ్ళటం కోసం మన మీద ప్రేమతో, దయతో చెప్పిన మాటలు కాని ఇవి మార్కెట్ కోసం చెప్పిన మాటలు కాదు. మనం సాధన చేసుకోవాలి అంటే పనిలో కూడా అతిగా ఉండకూడదు. టైముకి భోజనం చేయాలి, నిద్ర పోవాలి. మన డ్యూటీ మనం చేసుకోవాలి గాని అక్కరలేని గొడవలలోనికి వెళ్ళకూడదు. మన పనికోసం ఇతరుల మీద ఆధారపడకూడదు. అలాగ చేస్తూ మిగతా టైము నిన్ను నీవు తెలుసుకోవటానికి ప్రయత్నం చేయమని భగవంతుడు చెపుతున్నాడు. చెరుకుగెడ అంతా దేవుడు అయితే ఆ గెడలో ఉన్న రసం గురువు. భగవంతుడిని ఆరాధించగా, ఆరాధించగా ఆయన దయే శరీరం ధరించి వస్తుంది, వాడే గురువు. భగవంతుడికి రక్షించేపని, శిక్షించేపని కూడా ఉంటుంది కాని గురువుకు రక్షించేపనే కాని శిక్షించేపని లేదు, వాడు గురువు. గురువు నీకు ఆత్మవిద్యను భోదించటమే కాదు నీ స్థాయికి దిగి వచ్చి నీతో తిరుగుతూ ఉంటాడు, మీతో చనువుగా ఉంటాడు, మీరు బాగున్నారా, భోజనం చేసారా అని అడుగుతూ ఉంటాడు. ఇవన్నీ చేస్తున్నప్పటికీ తానెవరో తనకు తెలుస్తూ ఉంటుంది. గురువు అంటే ఆత్మ, గురువు అంటే బ్రహ్మం అక్కడకు నిన్ను తీసుకొని పోవటానికి నీతో మాట్లాడుతూ ఉంటాడు, నీతో కలిసి జీవిస్తూ ఉంటాడు, నీకు తెలియకుండా నెమ్మదిగా నిన్ను అక్కడకు తోలుకొనిపోతాడు. నీలో ఉన్న లోపాలు గురువుకు తెలుస్తూ ఉంటాయి, వాటిని నీకు చూపించి, వాటిని తొలగించు కోవటానికి నీకు శక్తిని ఇచ్చి నెమ్మదిగా వాటిని తొలగించుకొంటూ పోతాడు, వాడు గురువు తాబేలు, కుందేలు పరుగు పందెం వేసుకొంటాయి. కుందేలు ముందు వెళ్ళిపోతుంది. దగ్గరకు వెళ్ళిన తరువాత వెనక్కు చూస్తుంది తాబేలు కనబడటంలేదు. అది కనబడటంలేదు కదా అని కొంతసేపు రెస్టు తీసుకొందామని అక్కడ పడుకొంటుంది, ఈలోపుగా తాబేలు గమ్యానికి చేరుకొంటుంది. అంటే మీరు కుందేలులాగ పరుగెత్తుకొని వెళ్ళనక్కరలేదు, నెమ్మదిగా వెళ్ళినా సరియైన

మార్గంలో వెళితే మీరు గమ్యాన్ని చేరుకొంటారు. మీరు గమ్యాన్ని మర్చిపోకూడదు. రైట్ తింకింగ్, రైట్ బిహేవియర్, రైట్ ఏక్షన్ ఉండాలి.

గురువు అంటే బ్రహ్మమే కాని కాళ్ళు, చేతులు వేసుకొని వస్తాడు. మనతో మాట్లాడటానికి నోరు వేసుకొనివస్తాడు. ఆయన ఏది మాట్లాడినా శాంతి, జ్ఞానం జాలువారుతూ ఉంటుంది, ఏమాటకు ఆమాట జ్ఞానామృతం. మనతో కలిసి ఉంటూ, మనకు నొప్పి కలుగకుండా మన మనస్సుకు పట్టేటట్లు చెపుతాడు. గురువు టెన్షన్‌లో ఉండడు, మిమ్మల్ని టెన్షన్‌లో పెట్టడు. మీకు తెలియకుండానే తన హృదయంలోనుండి శాంతిని, ఆనందాన్ని మీ హృదయంలోనికి పంపేస్తాడు, వాడు గురువు. మీ మనస్సుకు ఏకాగ్రత కలుగజేస్తాడు, పవిత్రత కలుగజేస్తాడు, మీ మనస్సుకు ఎరుక ఇస్తాడు, వాడు గురువు. ఆయన చేసేపని గమ్యానికి వెళ్ళేవరకు మీకు తెలియదు. ఎప్పడో పొందుతాము అనుకొన్న సుఖం, ఆనందం ఇప్పడే వచ్చేసింది ఏమిటి? ఎప్పడే వెయ్యి జన్మల తరువాత ఆత్మజ్ఞానం కలుగుతుంది అనుకొన్నాము ఇప్పడే వచ్చేసింది ఏమిటి అని మీకు అనిపిస్తుంది, అది వచ్చేవరకు మీకు తెలియదు, అలా చేసేవాడు గురువు. మన శరీరాన్ని, మన ఇంద్రియాలను చూడడు, మనలో ఉన్న కుయుక్తులను, కుతంత్రాలను చూడడు. గురువు హృదయంలో ఏదైతే ఉందో అదే మన హృదయంలో కూడా ఉంది, సరిగ్గా దానినే చూస్తూ ఉంటాడు. మన మొఖాన్ని, మన ఇంద్రియాల్ని, మన మనస్సును అటు తిప్పతాడు. ఆత్మస్థితిలోనికి సర్జరీ లేకుండానే మనకు తెలియకుండానే మేల్కొలుపుతాడు, వాడు గురువు, ఆ ప్రక్రియలో మనకు ఏమీ తెలియదు. బోయవాడు జంతువును ఎలా వెంటాడుతూ వెడతాడో అలాగ మన అజ్ఞానాన్ని వెంటాడుతూ ఉంటాడు. ఎక్కడైతే శాంతి ఉందో ఆ హృదయంలోనికి మనలను తీసుకొని వెళ్ళటానికి మన మనస్సును ఎలా ప్రిపేర్ చేయాలి అని చూసుకొంటాడు. లోపల ఉన్న వస్తువు ఎంత నిర్మలంగా ఉందో, ఎంత నిశ్చలంగా ఉందో, ఎంత ఏకాగ్రంగా ఉందో, ఎంత సమానంగా ఉందో అలా మనస్సును తయారుచేసి అందులో కలిపేస్తాడు, వాడు గురువు. నీ మనస్సుకు లోచూపు కలగటం కోసం బయట ఉన్న గురువు బోధిస్తాడు. నిజమైనగురువు నీలోపలే ఉన్నాడు. బయట ఉన్న గురువు నిన్ను లోపలకు నెట్టుతాడు, లోపల ఉన్న గురువు నిన్ను లోపలకు లాక్కొని, ఆయన స్వరూపాన్ని ఇస్తాడు. గురువు అంటే తాను దేని గురించి అయితే చెపుతున్నాడో అది అయి ఉండాలి. సముద్రంలో కెరటంపైకి వస్తుంది మరల అణిగి పోతుంది అలాగే ఈయుగాలు అన్నీ కూడా చైతన్యంలో అణిగిపోతాయి, చైతన్యస్థితి అట్టిది. నువ్వు దేనికి భయపడవద్దు, భయరహితుడిగా ఉండు. ఉన్నది ఒక్కటే వస్తువు అదే లోకం కింద, జీవుడు కింద కనిపిస్తోంది అంతకంటే ఏమీలేదు. తల్లి తండ్రులు నీకు ఈ శరీరాన్ని ఇచ్చారు కాని గురువు జ్ఞానంలో నీకు జన్మను ఇస్తాడు, ఆ జన్మ వస్తే తిరిగి ఈ భూమి మీదకు రానక్కరలేదు, నీకు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే. గురువు అంటే ఏమీ లేదు నీకు బ్రహ్మజ్ఞానంలో జన్మనిచ్చేవాడే గురువు. గురువుకు దేహం అక్కరలేదు


అయినా నీ కోసం దేహం ధరించి వస్తాడు. జ్ఞానానికి దేహం అక్కరలేదు, అజ్ఞానానికి దేహం కావాలి. మీకు సబ్జక్టు అర్థం కాకుండా మీరు తింగరతనంగా సాధన చేసిన ప్రయోజనం లేదు. కుప్పనూర్పులో దూడల కింద ఉండకూడదు. సబ్జక్టును జాగ్రత్తగా అర్థం చేసుకోండి. మీకు ఎప్పుడైనా దుఃఖం వచ్చింది అనుకోండి, ఆ దుఃఖం తలంపు రూపంలో వస్తుంది. ఆ తలంపును చూసేవాడు ఒకడు ఉన్నాడు, వాడే అహంకారం. వాడిని తీసేస్తే దుఃఖం అప్పటికప్పుడు ఆరిపోతుంది. మీకు వచ్చిన తలంపు ఎంత నిజమో ఆచూచేవాడు కూడా అంతే నిజం. కొంతమంది రాముడు కనిపించాడు అంటారు. కనబడటం నిజమే కాని ఆ రాముడిని చూసిన మనస్సు ఎంత నిజమో ఆ మనస్సుచేత చూడబడే దేవుడు కూడా అంతే నిజం. ఆ సబ్జక్టు మీకు అర్థమవుతూ ఉంటే దుఃఖరహితస్థితికి ఇప్పడే వెళతారు. మనకు ఉన్న చదువువలనగాని, డబ్బువలన గాని, తెలివివలనగాని భగవంతుడు స్వాధీనమవ్వడు, భక్తి వల్లనే భగవంతుడు స్వాధీనమవుతాడు. భక్తుడు పరిపక్వతను బట్టి భగవంతుడు సాక్షాత్కరిస్తాడు. మన మనస్సును లోపలకు మళ్ళించేవాడు ఆయనే, మనకు మెచ్యూరిటీ తీసుకొని వచ్చేవాడు ఆయనే, మెచ్యూరిటీ వచ్చిన తరువాత మన హృదయంలో ఉన్న ఈశ్వరుడు ఎరుకలోనికి వస్తాడు. ఎక్కడో ఉన్నాడు అనుకొన్నాము ఇక్కడే ఉన్నాడు ఏమిటి అని అప్పుడు మనకు తెలుస్తుంది. గురువుదయ ఎలా ఉంటుంది అంటే వందజన్మల తరువాత వస్తుంది అనుకొన్నది ఇప్పడే వస్తుంది, గురువు దయ అట్టిది. గురువుకు అసాధ్యం అంటూ ఏమీ లేదు, ఏదైనా సాధ్యమే. నువ్వు వంద జన్మలలో అనుభవించవలసిన ప్రారబ్ధాన్ని ఒక్క జన్మలో నీచేత అనుభవింపజేసి వస్తువు నీకు గోచరమయ్యేటట్లు చేస్తాడు, వాడు గురువు.

గురువు పనిచేస్తున్నాడు కాని గురువు దయ ఏమీ కనబడటంలేదు ఏమిటి అని అప్పుడప్పుడు మనకు అనిపిస్తూ ఉంటుంది. మనకు ఎటుచూసినా కష్టాలు వస్తున్నాయి, మనస్సు అంతా పుండు అయిపోతోంది, ఎప్పుడు చూసినా అశాంతిగా ఉంటోంది అని మీకు అనిపిస్తూ ఉంటుంది. అలా ఎందుకు అనిపిస్తుంది అంటే మీ లోపల ఉన్న సంస్కారములను కెలికి వాటిని నీ బుద్ధికి తెలియజేసి, వాటిని బయటకు లాగి మంట పెట్టేవరకు నిన్ను విడిచిపెట్టడు, వాడు గురువు. కిరసనాయిలు డబ్బా మూత తీయకుండా ఇంటిలో పెట్టుకొంటే ఆ వాసన అలాగే ఉంటుంది. మూత తీసేసి రెండు రోజులు ఎండలో పెట్టండి ఆవాసన పోతుంది, అలాగే మీ గురువు మిమ్మల్ని ఎండబెడతాడు. అది మీ మీద ఇష్టంలేక కాదు, మీ మీద ప్రేమతోనే చేస్తున్నాడు, మిమ్మల్ని ఎక్కడికయితే తీసుకొని వెళ్ళాలనుకొంటున్నాడో అక్కడకు తీసుకొని పోవటానికి మిమ్మల్ని సమాయత్తం చేయటానికి గురువు చేసే పని అది. మీకు ఎక్కడో హృదయాంతరాళాలలో ఒక బలహీనత ఉంది అనుకోండి, అది మీకు తెలియటం లేదు అనుకోండి. మనకు పక్వత వచ్చేసింది, మనం ఫిట్ అయిపోయాము అని మీరు అనుకొంటారు. అప్పుడు గురువు ఏమి చేస్తాడు అంటే సరిగ్గా ఆ బలహీనత మీద బ్యాటరీలైటు

వేసి దానిని నీకు తెలియజేసి, దానిని తొలగించుకొనే శక్తిని నీకు ఇచ్చి, దానిని తొలగించుకొనే పరిస్థితులను క్రియేట్ చేస్తాడు, ఒకోసారి తలుపు సందునపెట్టి నొక్కుతాడు, తడి గుడ్డను పిండినట్లు లోపల ఉన్న బలహీనతను పిండి దానిని తొలగిస్తాడు, వాడే గురువు. ఈ పనులు అన్నీ ఎప్పుడు చెయ్యాలి, ఎలా చెయ్యాలి, ఎక్కడ చెయ్యాలి, ఆ చేసే పద్ధతి ఎలా ఉండాలి, ఆ ముహూర్తం అన్నీ కూడా ఆయనే పెట్టుకొంటాడు, వాడే గురువు. ఏ బలహీనతల వలన మనం ఈ శరీరానికి, లోకానికి, ప్రకృతికి బంధింపబడు తున్నామో, ఏ సపోర్టుల వలన మనం జీవిస్తున్నామో వాటిని ఒక్కసారే పడగొట్టడు. అలా అయితే మనం కంగారుపడతాము అని, భయపడతాముఅని, పిచ్చివాళ్ళము అయిపోతాము అని ఒక్కసారే ఆ సపోర్టులను ఊడగొట్టడు. ఒకోదానిని ఊడగొడుతూ వస్తాడు, వాడు గురువు. ఆ ఊడగొట్టేటప్పుడు కూడా మనం భరించగలిగే బాధను ఇస్తాడు గాని మనం భరించలేని బాధను ఇవ్వడు, వాడు గురువు. గురువు అనుకరణ చేయడు. ఎవరికి ఏరకంగా సర్జరీ చేయాలో అలాగ చేస్తాడు. నీలోఉన్న బలహీనతలు ఎలా లాగి మంటపెట్టాలో చూస్తాడు. ఇవన్నీ గురువు చూసుకొంటూ ఉంటాడు. మధ్యలో దారి తప్పిపోయాము అనుకోండి మరల దారి మళ్ళించి తన వడిలోనికి తీసుకొంటాడు, వాడు గురువు. వెయ్యి జన్మలకు పీడించే వాసనలను ఒకోసారి ఆయన చూపు ద్వారా కూడా పోగొడతాడు. గురువు యొక్క మాట, చూపు, కదలిక, మౌనం అంతా అనుగ్రహమే. మనం ఏదైనా పని చేయాలంటే దేహం ఉండాలి కాని గురువుకు దేహం అక్కరలేదు, గురువు సంకల్పించుకొంటే చాలు పని అంతా అయిపోతుంది. గురువు యొక్క అనుగ్రహం మహాప్రవాహం. మీ బలహీనతలు, పునర్జన్మ హేతువులు అన్నీ కూడా ఆ అనుగ్రహప్రవాహంలో కొట్టుకొనిపోతాయి, అట్టిది గురువు యొక్క దయ. మామిడిపండులో తొక్క, టెంక, గుంజు అన్నీ కలిసి దేవుడు అయితే, అందులో ఉన్న రసం గురువు. నువ్వు ఒకవేళ గురువును ప్రేమించటం మానివేస్తావు అనుకో, వాడి మీద ప్రేమ కలిగేటట్లు చేసి నీ మనస్సును ఆయన వైపుకు ఆకర్షించుకొంటాడు. నువ్వు ఏదైనా రాంగ్ పాత్‌లో వెళుతూ ఉంటే అందులో ఉండే ప్రమాదాన్ని నీకు చూపిస్తాడు, వాడు గురువు. అదృష్టం వెంటాడుతూ ఉన్నా, దురదృష్టం వెంటాడుతూ ఉన్నా గురువు ఎప్పుడూ సమానంగానే ఉంటాడు. మన మనస్సులో ద్వేషం ఉంది అనుకోండి అది మన మొహంలోనికి వచ్చేస్తుంది. మన మనస్సులో ఆనందం ఉంది అనుకోండి అది మన మొహంలోనికి వచ్చేస్తుంది ఎందుచేత నంటే ఈ శరీరం మనస్సుది. మనస్సు యొక్క ప్రభావం ప్రతీ అవయవం మీద ఉంటుంది. శరీరం చనిపోయేటప్పుడు ఏడ్చేవాడు కూడా మనస్సే. నీకు జ్ఞానం కలగకుండా ఏ బలహీనతలు అడ్డువస్తున్నాయో గురువు చూస్తూ ఉంటాడు. ఆ బలహీనతలను నీకు నొప్పి లేకుండా ఒకోదానిని తొలగించుకొంటూ ఆయన దయను చూపిస్తూ హృదయగుహలోనికి నిన్ను నెట్టుకుంటూపోతాడు, వాడు గురువు. నువ్వు ఎంత సాధన చేసినా, ఎంత ప్రయత్నం చేసినా గురువు కృపలేకుండా నీకు ఆత్మజ్ఞానం రాదు. గురువు దయ ఎలా ఉంటుంది అని

అడుగుతున్నారు గురువు దయ మాటలకు అందదు, మనస్సుకు అందదు, అది నీ ఊహలకు, తలంపుకు అందదు. నువ్వు అనుకొన్నట్లుగా అది ఉండదు, అది ఎలా ఉండాలో అలా ఉంటుంది. దానిని మనం నోటితే చెప్పలేము, వ్రాతతో చెప్పలేము, అది అనుభవైక వేద్యం అంటున్నారు భగవాన్.

మనం అజ్ఞానమనే నిద్రలో ఉన్నాము. ఈ అజ్ఞానమనే నిద్రలో నుండి మనలను మేల్కొలిపే వరకు గురువు మనలను వెంటాడతాడు. ఈ శరీరం చనిపోయాక మనం మరో జన్మలోనికి వెళతాము. ఏ జన్మలోనికి వెళతామో మనకు తెలియదు కానీ గురువు అది చూసుకొంటాడు, గురువు ఆ జన్మలోనికి కూడా వస్తాడు. మీరు ఎవరో మాకు తెలియదు అని గురువును అంటాము, వాడిని ప్రేమించము. కాని గురువు ఏమిచేస్తాడు అంటే వాడి మీద ప్రేమ కలిగేటట్లు కూడా ఆయనే చేసుకొంటాడు. జన్మాంతరంలో అనుబంధం ఉంటేనే జీవితం పొడుగునా ఆ ఆప్యాయత, ప్రేమ, స్నేహం నిలబడుతుంది. గురువుగా ఎవరిని ఎన్నుకోవాలి అని అందరిని అడగనక్కరలేదు. ఇప్పుడు మనమాట, మనస్సు ఒకటిగా లేదు. ఒకటిగా లేనట్లు గురువుకు తెలుస్తూ ఉంటుంది, వాటిని ఒక్కటిగా చేసేవాడే గురువు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే నీ మనస్సు ఎవరితో శ్రుతి కలుపుతోందో, ఎవరి సమక్షంలో నీ మనస్సు అణుగుతోందో, నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా ఎవరి దగ్గర అయితే నీవు అభౌతికమైన ఆనందాన్ని పొందుతున్నావో, ఎవరి సమక్షంలో నీకు సమానబుద్ధి కలుగుతోందో, ఎవరి సమక్షంలో నీలో ఉన్న చెడు తగ్గిపోయి మంచి విజృంభిస్తోందో, నిన్ను నీవు తెలుసుకోవాలి అనే బుద్ధి ఎవరి సమక్షంలో కలుగుతోందో వాడే నీ గురువు. నీ స్వరూపం దగ్గరకు నిన్ను తోలుకొని పోయేవాడే గురువు. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని నీకు పట్టి ఇచ్చేవాడే గురువు. నువ్వు ఎవరో నువ్వు తెలుసుకొనే బుద్ధి కలుగజేసేవాడే గురువు. నువ్వు ఎవరో నీకు తెలియకుండా దేవుడు తెలియబడడు. మనం ఎవరో మనం తెలుసుకోవాలి, మనం బాగుపడాలి, గుణసంపద పెంచుకోవాలి, చైతన్యస్థాయి పెంచుకోవాలి. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు గోచరం అవ్వకుండా దేవుడు కనిపించాడు ఏదో వరం ఇచ్చాడు అదీ, ఇదీ అనుకొంటే నీ మనస్సు ఎంత నిజమో అవి కూడా అంతేనిజం. పారమార్థికసత్యానికి ఈ కనిపించటం, కనిపించకపోవటానికి ఏమీ సంబంధం లేదు. నిన్ను నీవు తెలుసుకోవటమే నిజమైన మహిమ, అదే సత్యవిద్య, అదే ఆత్మవిద్య. మన భక్తి ఎలాగ ఉండాలంటే భగవంతుడు వచ్చి మోక్షం ఇస్తాను అంటాడు అనుకోండి మనం ఆవురు ఆవురుమంటూ ఉండకూడదు, నీ ఇష్టం అనాలి. ఆ మెచ్యూరిటీ మనకు రావాలి. నీ ప్రయత్నంతో ఇసుమంతయు సంబంధంలేకుండా ఎవరి సమక్షంలో నీ మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతోందో వాడే నీ గురువు, ఎవడైతే నీకు లోచూపు కలుగజేస్తున్నాడో, ఎవడైతే నీ హృదయంలో దివ్యదృష్టి ఇచ్చాడో వాడే నీ గురువు.



ది॥ 26-11-2004
అరుణాచలంలో జరిగిన
దీపోత్సవ కార్యక్రమములో
సద్గురు శ్రీ నాన్నగారు




రుద్రరాజు వెంకట సుబ్బరాజు, సీతామహాలక్ష్మి (వైజాగ్) వారి సహాయంతో వారి తండ్రిగారు రుద్రరాజు వెంకట సుందరరామరాజు పేరుమీద గుమ్మలూరులో నిర్మించిన ప్రాథమిక పాఠశాల ప్రారంభోత్సవంలో సద్గురు శ్రీ నాన్నగారు



అరుణాచల గిరి తిరువన్నామలై

REGISTERED NEWS PAPER

RNI NO. APTEL/1999/1667

Postal Regn.No.PMG/VJ/1-3/03

Prepayment : Tech-31/Pre.Pmt/BMV/02

Postage Prepaid

To

301. P. Sandhya, C/o P.V.S.V.K.
Varma, D.No. 151, Rao & Raju
Colony, BanjaraHills, Road No-2,
HYDERABAD - 500034

If undelivered please return to :
**RAMANA BHASKARA**
SRI RAMANA KSHETRAM
JINNURU - 534 265. W.G. Dt. A.P.

Editor, Printer, Publisher : **P.S. RAMA RAJU**
Lakshmi Modern Rice Mill, Ullamparru, Palakol - 534 265. W.G.Dt. © 08814 224589, 224689
Printed at : **SHRIRAM GRAPHICS,** Bank Street, Palakol - 534 260. W.G.Dt., © 222438